నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 10 జనవరి 2024 | ADILABAD

అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

స్పోర్ట్స్ మీట్‌కు కేబీ సుందరీకరణ

ఉట్నూర్, జనవరి 9 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డివిజన్ వేదికగా త్వరలో నిర్వహించనున్న ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్‌కు కుమ్రం భీం(కేబీ) ప్రాంగణాన్ని సుందరీకరించనున్నట్లు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. మంగళవారం ఆమె పనులను పర్యవేక్షించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు ఐదు వేలకు పైగా క్రీడాకారులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుండడంతో సుందరీకరించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న క్రీడాకారులు, అతిథులకు సకల వసతులు కల్పిస్తామని, ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి ఆకట్టుకునే మొక్కలను తెచ్చి నాటుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ భీంరావు, పీహెచ్‌వో సందీప్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

బియ్యాన్ని తరలించాలి..

● నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ● స్వర్ణలో రైస్‌మిల్ తనిఖీ

సారంగాపూర్, జనవరి 9 : రైస్‌మిల్‌లో నిలువ ఉన్న బియ్యాన్ని ఈనెల 30వ తేదీ వరకు తరలించాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ గ్రామంలోని లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్‌మిల్‌లో ఉన్న బియ్యం స్టాక్, గోదాంలో ఉన్న వరిధాన్యం నిల్వలు ఎంత ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్ రిజిస్టర్‌లు, లారీలో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్‌మిల్‌లో బియ్యాన్ని పూర్తిగా ఖాళీ చేయాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ శాఖ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్‌డీవో రత్నకల్యాణి, డీఎం శ్రీకళ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో సరోజ, సివిల్ సప్లయ్ అధికారి రవీందర్‌రెడ్డి, ఆర్ఐ ముంతాజ్ పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించడమే ధ్యేయం

నిర్మల్ అర్బన్, జనవరి 9 : విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంపొందించడం, ప్రయోగాత్మక విద్యను అందించేందుకు అగస్త్య ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శాంతినగర్ కాలనీలో గల నిర్మల్ అర్బన్ కేజీబీవీలో నిర్వహించిన మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి మొబైల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఫౌండేషన్ జీఎం బలరాం, ఏరియా మేనేజర్ శ్రీదేవి, డీఈవో రవీందర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, ఎంఈవో శంకర్, సెక్టోరియల్ అధికారులు శ్రీదేవి, నర్సయ్య, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మ పాల్గొన్నారు.

రైస్‌మిల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

● మా పొట్ట కొట్టొద్దు..

'ఉపాధి'కి దూరం

ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 10,975 మందిపై ప్రభావం

● కేంద్ర నిబంధనల ఫలితంగా కష్టాల్లో నిరుపేద కూలీలు ● ఆధార్ అనుసంధాన ప్రక్రియ ముగియడంతో ఆవేదన

● నష్టనివారణ చర్యలు తీసుకుంటామని అధికారుల హామీ ▼ ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆదిలాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 17 రూరల్ మండలాల పరిధిలో 468 గ్రామ పంచాయతీ(జీపీ)లు ఉన్నాయి. 1.70 లక్షల ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉండగా.. 3.42 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఇందులో 1.13 లక్షల యాక్టివ్ జాబ్‌కార్డుల్లో 2.13 లక్షల మంది కూలీలు క్రమం తప్పకుండా ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా అమలు చేస్తున్న నిబంధనలు కూలీల పాలిట శాపంగా మారుతున్నాయి. ఉపాధి కూలీలు తమ జాబ్‌కార్డులను ఆధార్‌కు లింక్ చేసుకోవాలనే నిబంధన కారణంగా 10,975 మంది కూలీలు ఉపాధికి దూరమయ్యే ప్రమాదం ఉంది. గతంలో ప్రతి జీపీలో యేటా 20కి మించి పనులు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కూలీలకు పనులు దొరకడం లేదు. ప్రస్తుతం జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం చేయాలనే ఆదేశాలు ఉండడంతో కూలీలు మరింత నష్టపోనున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు తమ పొట్ట గొట్టే విధంగా ఉన్నాయని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

10,972 మంది కూలీలపై ప్రభావం

ఆదిలాబాద్ జిల్లాలో ఆధార్ అనుసంధాన విధానం 10,975 మంది కూలీలపై ప్రభావం చూపనుంది. 2,13,508 మంది రెగ్యూలర్‌గా పనులకు వెళ్లే కూలీలు ఉండగా.. వీరిలో 2,06,231 కూలీల జాబ్‌కార్డులు ఆధార్‌తో అనుసంధానం అయినవి. ఉపాధి హామీల పథకంలో పనిచేసే కూలీలు వారి వేతనాలను పొందడానికి కేంద్ర ప్రభుత్వం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానంలో భాగంగా సిబ్బంది గ్రామాల్లోని తమ పరిధిలో పనులు చేసే కూలీల జాబ్‌కార్డులను ఆధార్ అనుసంధానం చేయాలి. దానిని కూలీలు తమ బ్యాంకు, పోస్టాఫీసు బ్యాంకు ఖాతాలకు లింక్ చేసుకోవాలి. ఈ ప్రక్రియకు డిసెంబరు 31, 2023 వరకు గడువు విధించగా ముగిసింది. ఆధార్‌కు అనుసంధానించిన జాబ్‌కార్డులు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆమోదం పొందిన తర్వాత కూలీలకు వేతనాలు వారి బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాల్లో జమ అవుతాయి. ఇలా ఆధార్ అనుసంధానమైన ఆమోదం లభించనవి వారు ఆదిలాబాద్ జిల్లాలో 10,975 మంది కూలీలు ఉన్నారు. ఆధార్ అనుసంధానం గడువు ముగియడంతో తాము ఉపాధి నష్టపోవాల్సి వస్తున్నదని కూలీలు వాపోతున్నారు. అనుసంధానం కానీ వారు కూలీలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఉపాధి హామీ అధికారులు అంటున్నారు.

నిర్మల్ చరిత్రకు నిదర్శనం ఈ పుస్తకం

ఆవిష్కరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కవులు

నిర్మల్ అర్బన్, జనవరి 9: 'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' అనే పుస్తకం నిర్మల్ జిల్లా చరిత్రకు నిదర్శనమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తకం రచించిన కవులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పాల చక్రధరి, దామెర రాములు, తుమ్మల దేవ్‌రావ్, నేరేళ్ల హన్మంతు, అమరవేణి వెంకటరమణ, జాదవ్ పుండలిక్, కామారపు జగదీష్, పోలీస్ భీమేశ్, పత్తి శివప్రసాద్, వెంకట్, బొందిడి పురుషోత్తం, చెన్నయ్య పాల్గొన్నారు.

ఓలా గ్రామంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

'బోనం' సమర్పయామి..

నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని ఓలా గ్రామంలో బోనాల సందడి నెలకొంది. గత శుక్రవారం గ్రామంలో వీరాంజనేయ, శివ, పార్వతీ, గణేశా, నందీ, ఇప్పల ఎల్లమ్మ, రేణుకా, పరశురామ, పెద్దమ్మ తల్లి దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మంగళవారం ఆయా దేవతకు బోనాలు సమర్పించారు. నైవేద్యం వండి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఊరంతా కదిలిరావడంతో పురవీధులు బోనాలతో నిండిపోయాయి. ఈ సందర్భంగా శివసుత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఊరంతా సందడిగా మారింది. **- కుంటాల, జనవరి 9**

దీక్షభూమికి ఆధ్యాత్మిక శోభ

● రేపటి గురుకృపా దివస్‌కు భారీ ఏర్పాట్లు ● శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ పుణ్యక్షేత్రం ముస్తాబు

● పలు రాష్ట్రాల నుంచి తరలిరానున్న బంజారాలు ● హాజరుకానున్న ప్రముఖులు.. ప్రారంభమైన జాతర..

నార్నూర్, జనవరి 9 : మండలంలోని కొత్తపల్లి(హెచ్)లో గల బంజారా దీక్షభూమి ఆధ్యాత్మిక శోభను సంతరించుకొనున్నది. దీక్షగురువు శ్రీసంత్ ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో యేటా జనవరి 11వ తేదీన గురు, శిష్యుల మిలాన్(దీక్ష దివస్)ను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా దీక్షభూమిలో కొలువుదీరిన బంజారాల కులదైవాలైన జగదాంబాదేవి, రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ, ధర్మగురువు రామారావ్ మహారాజ్ ఆలయన్ని ముస్తాబు చేశారు. ఇక్కడ బోగ్‌భండార్ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇందులో భాగంగా శ్రీసేవాలాల్ మహారాజ్ పల్లకీని గంగాపూర్(తండా)నుంచి వైభవంగా శోభాయాత్రగా కాలినడకన దీక్షభూమికి చేరుస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. 15వ తేదీ వరకు భజన, కీర్తనలు కొనసాగుతాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తుండగా.. గురుకృపా దివస్‌కు ప్రముఖులు హాజరుకానున్నారు.

దీక్ష భూమి ప్రత్యేకత

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్దిలో 1978వ సంవత్సరంలో దీక్ష గురువు శ్రీసంత్ ప్రేమ్‌సింగ్ మహారాజ్ తపస్సు చేశారు. జనవరి 11, 1979న మహారాష్ట్రలోని పొరదేవి నుంచి ధర్మగురువు రాష్ట్రీయ సంత్ మహాన్ తపస్వీ రామారావు మహారాజ్ శంకర్‌లొద్దికి వచ్చారు. ప్రేమ్‌సింగ్‌కి మహారాజ్ ఉపదేశించారు. సమాజ జాగృతం కోసం తండాలకు వెళ్లి ధర్మప్రచారం చేయాలని ఆదేశించారు. అప్పటి నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌తో పాటు ప్రతి రాష్ట్రంలో ధర్మ ప్రచారం చేస్తున్నారు. 1988లో శంకర్‌లొద్ది గ్రామంలో శివయజ్ఞం, 1992లో కొత్తపల్లి(హెచ్) ప్రేమ్‌సింగ్ ఆలయం వద్ద లక్ష్య చండీయజ్ఞాన్ని నిర్వహించారు. ఆనాటి నుంచి యేటా జనవరి 11వ తేదీన జాతీయ దీక్షభూమి వద్ద గురు, శిష్యుల(మిలాన్ దివస్) గురుకృపా దివస్‌ను భక్తిశ్రద్ధలతో బంజారులు నిర్వహిస్తారు.

శ్రీ సంత్ రామారావు మహారాజ్ ప్రతిమ

జగదాంబాదేవి ప్రతిమ

శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం

సామాజిక చైతన్యంపై హితబోధ..

జనవరి 11న భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి దీక్షభూమికి తరలివస్తారు. బోగ్‌భండార్ ఎదుట భక్తులను దీక్ష గురువు సామాజిక అంశాలపై చైతన్య పరుస్తారు. మత్తుపానియాలు, పొగాకు, కల్లు, గంజాయి, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలని వివరిస్తారు. బాల్యవివాహాలు చేయవద్దని, వరకట్నం ఇచ్చిపుచ్చుకునే ధోరణి మానుకోవాలని, పిల్లలను తప్పకుండా పాఠశాలలకు పంపించాలని, విద్యా బోధన చేయించాలని, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని భక్తులకు హితబోధ చేస్తారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

యేటా జనవరిలో గురుశిష్యుల(మిలన్ దివస్)ను నిర్వహిస్తాం. సమాజ చైతన్యం కోసం ఆధ్యాత్మికతపై వివరిస్తాం. నేటి తరానికి సంస్కృతీసంప్రదాయాలతోపాటు సన్మార్గంలో నడవాలని వివరిస్తాం. శాంతి, అహింసతో ఏదైనా సాధ్యమవుతుందని తెలుపుతాం. ఏర్పాట్లు మాత్రం ఘనంగా చేశాం.
- సేలావాల్ శ్రీసంత్ ప్రేమ్‌సింగ్ మహారాజ్, దీక్షగురు.

ప్రజల గుండె చప్పుడు వినిపించే భాష హిందీ

మాట్లాడుతున్న ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

భైంసా, జనవరి 9 : ప్రజల గుండె చప్పుడు వినిపించే భాష హిందీ అని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని గోపాల్ రావు పటేల్ డిగ్రీ కళాశాలలో 'మానవీయ సంవేదన సాహిత్య విభిన్నస్వర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. భారతదేశం వివిధ సంస్కృతులు, విభిన్న భాషలు, విభిన్న నాగరికతకు నెలవు అన్నారు. ప్రతి రాష్ట్రానికి ఒక ప్రాంతీయ భాష ఉందని, ఒకే రాష్ట్రంలో కొన్ని గిరిజన ప్రాంతాలకు వెళితే అక్కడ వారి భాష మరొకలా ఉంటుందన్నారు. ఆయా వర్గాల వారు మరొకరితో మాట్లాడుకునేందుకే అనుసంధానంగా వ్యవహరించేది హిందీ భాష అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, జాతీయ సదస్సు కన్వీనర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

రైల్వే పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ధనుంజయులు

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 9 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్(ఏజీఎం) ధనుంజయులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. రైల్వే ఆస్పత్రి, క్వార్టర్స్‌ను సందర్శించారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ.. ప్రయాణికుల సౌకర్యార్థం మూడు లిఫ్ట్‌లతోపాటు ఫుట్‌వేర్ బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. ఫిట్‌లైన్ పనులు వచ్చే మార్చి నాటికి పూర్తయితాయని, దీంతో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి వస్తాయన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌కు మంగళవారం వచ్చిన దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనంజయులుకు వినతులు వెలువత్తాయి. ఈ మేరకు రైల్వే బోర్డు మెంబర్ రమణతోపాటు కాంగ్రెస్, బీజేపీ నేతలు, స్టేషన్‌కు అవతల వైపు ఉన్న కాలనీవాసులు ఏజీఎంను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్ల సంఖ్య పెంచాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని విన్నవించారు. దీనికి ఏజీఎం సానుకూలంగా స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..

ఆన్‌లైన్ పేరిట వచ్చే ఉద్యోగాలతో నిరుద్యోగులు జాగ్రత్త

● నిర్మల్‌లో సైబర్ మోసంతో రూ.18.95 లక్షలు దోపిడీ

● రూ.13.19 లక్షలను రికవరీ చేసిన పోలీసులు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి షర్మిల

మాట్లాడుతున్న నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, జనవరి 9 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ పేరిట వచ్చే ఉద్యోగాలు, అత్యాశకు పోయి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించే మార్గాలకు దూరంగా ఉండాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. నిర్మల్ పట్టణానికి చెందిన దీక్షిత్ ఉద్యోగాల వేటలో ఉండి రూ.18.95 లక్షలు పోగొట్టుకున్నాడు. పోలీసుల చొరవతో రూ.13.19 లక్షలను రికవరీ చేసి బాధితుడికి అందించారు. ఈ వివరాలను మంగళవారం తన కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల వెల్లడించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన అనుపోల్ల దీక్షిత్ కుమార్ ఉద్యోగం వేటలో ఉన్నాడు. ఈ క్రమంలో తన టెలిగ్రామ్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేశాడు. ఆగస్టు 14, 2023న టెలిగ్రామ్‌లో పార్ట్ టైం జాబ్ గురించి మెసేజ్ రాగానే పూర్తి వివరాలు పంపించాడు. కొద్ది రోజుల తర్వాత ఆగస్టు 22, 2023న తన బ్యాంకు అకౌంట్ నుంచి రూ,18,95,990 డబ్బులు పోయాయని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ పురుషోత్తం కేసు నమోదు చేసి పూర్తి వివరాలు తెలుసుకుని దర్యాప్తు మొదలు పెట్టాడు. ఉద్యోగం కోసం వెతుకుతున్న క్రమంలో టెలిగ్రామ్ లింక్‌కు దీక్షిత్ పూర్తి వివరాలు పంపించాడు. వర్చువల్ అకౌంట్ క్రియేట్ కాగా.. దీక్షిత్ బ్యాంక్ అకౌంట్‌లో రూ.10 వేలు డిపాజిట్ అయ్యాయి. తరువాత దీక్షిత్ కొన్ని టాస్కులు పూర్తి చేయడంతో మళ్లీ రూ.1,019 దీక్షిత్ అకౌంట్‌లో జమ అయ్యాయి. ఆ తర్వాత దీక్షిత్ రూ.10 వేలను టెలిగ్రామ్‌లో ఇచ్చిన ప్రకారం లింక్‌లో వచ్చిన బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశాడు. ఇలా వివిధ టాస్కుల కింద ఆగస్టు 17, 2023 నుంచి ఆగస్టు 19, 2023 వరకు రూ.18,95,990 వివిధ అకౌంట్లలో జమ చేశాడు. ఎంతకు స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన దీక్షిత్ తన డబ్బులు పంపించాలని మెసేజ్ పెట్టాడు. సెక్యూర్ డిపాజిట్ కింద 50 శాతం డబ్బులు కడితేనే తిరిగి నీ డబ్బులు ఇస్తామని మెసేజ్ వచ్చింది. వీరు ఏడు ఐసీఐసీఐ బ్యాంకులు, రెండు ఎస్ బ్యాంకు అకౌంట్‌ల నుంచి లావాదేవీలు నడిపించారు. దీంతో దీక్షిత్ అకౌంట్ల నుంచి డబ్బులు విత్ డ్రా చేయించకుండా సైబర్ క్రైమ్ ఇన్‌చార్జి రవికుమార్ సహాయంతో వివిధ బ్యాంకు అధికారులకు నోటీసులు అందించి అకౌంట్లను ఫ్రీజ్ చేయించాం. దీక్షిత్ డబ్బులు రీఫండ్ గురించి సంబంధిత కోర్టులో పిటిషన్ ఫైల్ చేయగా డిసెంబర్ 21, 2023 కోర్టు రీఫండ్ ఆర్డర్ తీసుకుని బాధితునికి రూ.13,19,914 తిరిగి ఇచ్చాం. కేసును ఛేదించిన సీఐ పురుషోత్తమాచారి, సైబర్ క్రైమ్ జిల్లా ఇన్‌చార్జి రవి కుమార్, ఏపీపీ సతీశ్‌లను అభినందించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ గంగారెడ్డి ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ పురుషోత్తం పాల్గొన్నారు.

.. మరిన్ని జిల్లా వార్తలు 8లో

డిస్కౌంట్‌ను సద్వినియోగం చేసుకోండి..

నిర్మల్ అర్బన్, జనవరి 9 : వాహనాలపై గతేడాది డిసెంబర్ 25వ తేదీలోపు విధించిన చలాన్స్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల సూచించారు. బుధవారంతో చలాన్ల గడువు తేదీ ముగుస్తున్నదని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 5,59,280 వాహనాలపై చలాన్లు ఉండగా.. ఇప్పటి వరకు 1,25,321 చలాన్లు మాత్రమే కట్టారని పేర్కొన్నారు. మిగతా వాహనదారులు ఈ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భయాందోళన అవసరం లేదు..

మొబైల్ పోయినా, దొంగిలించబడినా ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 24 సెల్‌ఫోన్స్‌ను బాధితులకు ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 421 సెల్‌ఫోన్స్‌ను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ పురుషోత్తం, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.